


'జగనన్న వసతి దీవెన' వాయిదా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా శింగనమల నుంచి ఈనెలా 17న సోమవారం జగనన్న వసతి దీవెన 2022 -23 విద్యా సంవత్సరానికి తొలివిడత అర్హత కలిగిన విద్యార్థుల తల్లుల ఖాతాలకు రాష్ట్రవ్యాప్తంగా జమ చేసే కార్యక్రమం వాయిదా వేయడమైనదని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం రద్దు చేయడమైనదని, వసతి దీవెన నిధుల జమచేసే తేదీ గురించి తదుపరి తెలియచేయగలమని తెలిపారు.

మోడీని గద్దె దింపుదాం





ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: దేశాన్ని కార్పొరేట్లకు అమ్మేస్తున్న మోడీని గద్దె దింపుదామని సిపిఎం నియోజకవర్గ ఇన్చార్జి అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచార యాత్రను చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఏపీలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ వ్యక్తులకు అప్ప చెప్పే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. ఈనెల 20వ తేదీన శ్రీకాళహస్తి పట్టణం వేదికగా మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టనున్న ప్రచారభేరి మహాసభకు ప్రజలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. నాయకులు జనమాల గురువయ్య, గంధం మణి, గోపి, శివ, మురళి, రాజా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: గాడి తప్పిన మోడీని గద్దె దింపాల్సిందే అని సిపిఐ- సిపిఎం ప్రచారభేరి కార్యక్రమంలో నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సిపిఐ సత్యవేడు నియోజకవర్గం ఆంభాకం చిన్నిరాజ్, నాయకులు చంద్రబాబు, అన్నాదరై, మునిచంద్ర, వాసు, రాజా తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: కేంద్రప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టి, దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం- సీపీఐ నాయకులు ఆధ్వర్యంలో రెండోరోజు ప్రచారభేరి పాదయాత్రను ప్రారంభించారు. ఆదివారం గూడూరు పట్టణంలోని జనార్ధన్ రెడ్డి కాలనీ జంక్షన్ నుంచి శాంతినగర్ మీదుగా పాదయాత్ర సాగింది. ఈకార్యక్రమంలో సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్,



పామంజి మణి, బీవీ.రమణయ్య, బి.చంద్రయ్య, రామిరెడ్డి, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, సీపీఐ నాయకులు ఎంబెటి చంద్రయ్య పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి రూరల్: ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద పార్టీ అయినా బిజెపిని దేశం నుంచి తరిమికొట్టడానికి ప్రతిపౌరుడు ముందుకు రావాలని సిపిఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. మండలంలోని జింగిలిపాలెం పంచాయతీలో ఆదివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ బాధ్యులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుప్పమ్మ, సిపిఎం నాయకులు గురవయ్య, గోపి పాల్గొన్నారు.

కెవిబి పురం: మండలలోని పేరుందేశం రాగుంట గ్రామాల్లో సిపిఎం సిపిఐ ప్రచారభేరి పోస్టర్లు సిపిఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిరంకుశ విధానాలపై మతోమాదాన్ని కార్పొరేటర్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళా సంఘం వరలక్ష్మి వెంకటముని, మురగయ్య పాల్గొన్నారు.



పుత్తూరు టౌన్: మండల కేంద్రంలో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్ర కార్యక్రమాన్ని అంబేద్కర్ సర్కిల్ నుంచి ప్రారంభించారు. అనందరం ప్రజలకు పంచిపెట్టారు. ఈ ప్రచారభేరి కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించకూడదని అడ్డుకోవడంతో పాటు ఎస్సై మోహన్ నాయకులు పట్ల దురుసుగా మాట్లాడటం జరిగింది. ఈకార్యక్రమం జరగడానికి ఎలాంటి పరిమిషన్ లేదని ఈరూట్లో వీఐపీలు వస్తున్నారని మంత్రి వస్తున్నారని, మంత్రి వచ్చే టైంలో ఎలాంటి కార్యక్రమాలు ఇక్కడ చేయకూడదని తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు కలగజేసుకొని ఈ ప్రచారభేరి కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, తాము ట్రాఫిక్ కానీ రోడ్డుకు అడ్డంగా కానీ నిలబడటం లేదని అంబేద్కర్ విగ్రహందగ్గర నిలబడి నిరసన తెలియజేస్తున్నామని చెప్పారు. ఎంత చెప్పినా ఎస్ఐ మీకు పర్మిషన్ లేదని ఇక్కడ చేయకూడదని ఎస్ఐ మొండిగా వ్యవహిరంచడంతో దీనిపైన ఎస్పీని కలిసి ఎస్ఐ పైన చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వంపెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిందని అందువల్ల పేదల ఆర్థికవనరులు గణనీయంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల ప్రభుత్వాస్తులను కార్పొరేట్ కంపెనీలకు మోడీ ప్రభుత్వం కారుచౌకుగా అమ్ముతావుందని, రైల్వే, ఎల్ఐసి, ఎయిర్‌పోర్టు, ఓడరేవులు క్రీడామైదానాలు శ్రీహరికోట రాకెట్ కేంద్రం విశాఖ ఉక్కు కర్మాగారం ఇందులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి.మహేష్, సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి ఆర్.వెంకటేష్ సిపిఐ నాయకులు సెల్వరాజ్ ఆచారి, గోపి, సర్వనా, కష్ణారెడ్డి, దినేష్, దిలీప్, సిపిఎం నాయకులు విజయ్, సుబ్రమణ్య పిళ్లై, పురుషోత్తం, శివ, మునిశేఖర్, వెంకటేష్, రమేష్ వెంకటాద్రి పాల్గొన్నారు.



చౌక దుకాణాల్లో

బినామీలదే హవా..!

- తనిఖీలు చేయని రెవెన్యూ పౌరసరఫరాల అధికారులు
- జిల్లాలో గాడి తప్పిన రేషన్ వ్యవస్థ



ప్రజాశక్తి- తిరుపతిటౌన్:

వారు ఆడిందే ఆట... పాడిందే పాట...! రేషన్ బినామీల రాజ్యం అక్కడ ఇక్కడా అనేది కాదు. అన్నిచోట్ల బినామీ రేషన్ డీలర్ల హవా కొనసాగుతోంది. అధికారులతో పాటు అధికారపార్టీ నేతలను ప్రసన్నం చేసుకుని తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. పేదలకు అందాల్సిన రేషన్ సరుకులను నల్లబజారుకు తరలిస్తున్నారు. పైగా ఒక్కొక్కరు రెండు, మూడు షాపులు నిర్వహిస్తూ పెద్ద ఎత్తున సరుకులను రవాణా చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో 40శాతం మంది బినామీలతోనే నడుస్తుండటం గమనార్హం.

పేరు ఒకరిది .. నిర్వహణ మరొకరిది..

రేషన్ షాపు ఎవరి పేరిట ఉందో వారే నిర్వహించాలి. కానీ జిల్లాల్లో నిబంధనలకు విరుద్ధంగా చౌకదుకాణాల్లో బినామీలు పాగా వేశారు. పేదలకు నిత్యావసర సరుకులు ప్రకమంగా సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎన్ని సంస్క రణలు తెస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారి పోతుంది. దుకాణం ఎవరి పేరున ఉందో.. ప్రస్తుతం ఎవరు నిర్వహిస్తున్నాడో తెలియని పరిస్థితి నెలకొంది. ఎంతో కాలంగా చౌక దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై ఆరోపణల నేపథ్యంలో కొందరిని, స్థానిక రాజకీయాల నేపథ్యంలో మరికొందరిని తప్పించారు. అధికార పార్టీనేతల ఒత్తిడి తట్టుకోలేక ఇంకొందరు డీలర్లు చౌక దుకాణాల నిర్వహణకు దూరమయ్యారు. కొందరు మాత్రం తమ పేరునే కొత్త వ్యక్తులు దుకాణాలు నిర్వహించేందుకు సమ్మతించడంతో పౌరసరఫరాల వ్యవస్థ జిల్లాలో అస్తవ్యస్తంగా మారింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2,889 రేషన్ దుకాణాల ద్వారా 11,55,525 మంది తెల్లకార్డు దారులకు సుమారు 400 ఎండియూ ఆపరేటర్ల ద్వారా సరుకులు సరఫరా అవుతు న్నాయి. వాహనాల ద్వారా సరుకులు పంపిణీ జరుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రస్తుతం రేషన్ దుకాణాలు నిర్వహిస్తున్న వారిలో 30 నుంచి 50శాతం వరకు బినామీలే. గతంలో డీలర్లుగా పనిచేస్తున్న వారి పేరునే కొనసాగిస్తూ నిర్వహణ మాత్రం కొత్తవారు చేస్తున్నారు. సంబంధించి డీడీలు తీయాలన్నా నిర్వహణకకు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవడం పనుల్లో బినామీల హవా కొనసాగుతోందన్నది బహిరంగ రహస్యం.

అధికారపార్టీ వారే డీలర్లు...

ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీకి చెందిన ద్వితీయ, తతీయ శ్రేణీ నాయకులే డీలర్‌గా అవతారం ఎత్తడం జిల్లాలో పరిపాటిగా మారింది. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉండటంతో జిల్లాల్లో చాలా చోట్ల వైసీపీకి చెందిన నాయకులే డీలర్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో నాయకులు ముందు రేషన్ దుకాణాలపై దష్టిపెట్టి పాగా వేశారు. పాగా వేయడం మొదలు రేషన్ అక్రమాలకు తెరతీశారు. కొందరు కీలరేమిల్లులను కూడా నడుపుతుండటం గమనార్హం. ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ రేషన్ అక్రమాలకు పాల్పడుతున్నారు.

అక్రమాలకు బాధ్యులెవరు..!

నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలు జరిగితే బాధ్యులు ఎవరు అనే దానికి స్పష్టత కరువైంది. దుకాణం గతంలో కేటాయించిన వ్యక్తుల పేరుతోనే ఉంటున్నందున తప్పులు గుర్తిస్తే అతని పైనే కేసు నమోదు చేయాలి, కానీ దుకాణం నిర్వహించకుండా వదిలేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేస్తే అధికారులు స్థానికంగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను గుర్తించిన అధికారులు దుకాణాలు తనిఖీలు చేయడం. మానేశారు. తనిఖీలు చేస్తే 6ఏ కేసులు నమోదు చేసేం ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో జిల్లాల్లో 6ఏ కేసుల నమోదు సంఖ్య గణనీయంగా తగ్గడానికి కారణంగా చెబుతున్నారు.

అధికారులు కన్నెత్తి చూస్తే ఒట్టు....

రేషన్ దుకాణాలను అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్ దుకాణాలను రెవెన్యూ అధికారులతో పాటు, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీలు, ఆర్ఎలకు తనిఖీ చేసే అధికారం ఉంది. గతంలో ఉన్నతాధికారులు సమీక్ష సమావేశాలలో దుకాణాల తనిఖీల గురించి వివరాలు అడిగేవారు. ఇటీవలకాలంలో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడులు సైతం లేకపోవడంతో మండలస్థాయి అధికారులకూ తనిఖీలు గాలికొదిలేశారు. రేషన్ షాపుల పర్యవేక్షణ బాధ్యత ఆహార తనిఖీ అధికారులపై ఉంది. ఫిర్యాదులు అందినప్పుడో సరుకులు దుకాణాలకు సరఫరా లేక ఒత్తిడిలు వచ్చినప్పుడో తనిఖీలు జరగాలి. కానీ ఈతనిఖీలు ఎక్కడా జరగడం లేదు. ఏసమయంలో కూడా అధికారుల తనిఖీల ఊసే ఎత్తడం లేదు. కొందరు దుకాణాల్లో కనీసం నిల్వలను కూడా పరిశీలించడం లేదు. రేషన్ దుకాణాలకు సంబంధించిన దస్త్రాలను తమ కార్యాలయాల్లోనే పరిశీలించినట్లు బియ్యం పక్కదారి పడుతున్నాయని తెలిసినా.. అధికారుల ఆ దిశగా దష్టి సారించకపోవడం గమనార్హం.


ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీల తనిఖీల జాడేది...

రేషన్ దుకాణాలను నిత్యం తనిఖీలు చేయాల్సిన ఎన్ఫోర్స్మెంట్ డీటీల జాడే కనిపించడం లేదు. జిల్లా పరిధిలో ఉన్న రేషన్ దుకాణాలను తనిఖీలు చేసి, కార్డుదారులకు సకాలంలో సరుకులు అందుతున్నాం.. లేదా? స్టాక్ ఎంత వరకు ఉంది... ఎంత సరుకులు ఇచ్చారు.. వంటి తదితర విషయాలపై సారించాల్సి ఉంది. కానీ, డీటీలు ఆదిశగా పెట్టడం లేదు. నెలనెలా రేషన్‌డీలర్ల అందుతున్న అమ్యామ్యాలకు అలవాటుపడి.. అన్ని సక్రమంగానే ఉన్నట్లు రికార్డుల్లో రాసేస్తున్నారు. కనుసన్నల్లోనే ఎండియూ ఆపరేటర్లు కూడా చేస్తున్నారు. దీంతో డీలర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల తనిఖీలు చేస్తే డీలర్లు, ఎండియూ ఆపరేటర్లు ఏదైనా పొరపాట చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అధికారుల తనిఖీలు లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా.. సాగుతోంది. పౌరసరఫరాలశాఖ అధికారులు ప్రతిసారి తూతూ మంత్రంగానే రేషన్ దుకాణాలను తనిఖీలు చేస్తున్నారు. డీలర్ల వద్ద ఉన్న రేషన్ నెంబర్లు నమోదు చేసుకొని, పంపిణీ అంతా సవ్యంగా జరుగుతున్నట్టుగా నివేదిక తయారు చేసేదాని వేలిముద్ర తీసుకొని వెళ్ళిపోతున్నారు. అధికారులు పరిశీలనకు వచ్చిన రోజునే ఒక్కో డీలరు తన స్థోమతను బట్టి రూ. 3వేల నుంచి 5 వేల వరకు ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు జరిగితే డీలరే భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నాచితకా ప్రభుత్వ కార్యక్రమాలు అధికారులు డీలర్లను పురమాయిస్తున్నారు. ఇక సరుకులు వచ్చిపోయేటప్పుడు దారిఖర్చులు, డీజిల్, పని కానిచ్చేస్తున్నారు. ప్రతినెలా వందల టన్నుల బిల్లు డీలర్లే భరిస్తున్నట్లు సమాచారం. ఇన్ని చేస్తున్నప్పటికీ డీలర్ల పై అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతాం: ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు లేబూరి రత్నకుమార్ తెలిపారు. స్థానిక యూత్ హాస్టల్‌లో ఐఎన్‌టియుసి ఉమ్మడి చిత్తూరు జిల్లా (అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల) కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాను మూడు జిల్లాలుగా విభజించారని, వాటికి 2022 డిసెంబరులో కొత్త కమిటీలు వేశామన్నారు. తర్వాత తొలి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ చర్చించామని అన్నారు. మూడుజిల్లాలో ఐఎన్‌టియుసిని మరింత బలోపేతం చేసి, ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న 39వేల సభ్యత్వాలను మరింత పెంచుతామని తెలిపారు. కార్మిక సంఘాలన్ని ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని కార్పొరేట్ సంస్థలు పాలిస్తున్నాయని విమర్శించారు. పలు సంస్థల్లో కార్మికులను తగ్గించేసి, సంస్థలను కార్పొరేట్‌కు అప్పగిస్తూ కేంద్రం ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని అమ్మేస్తోందని, ఎర్రకోట, విమానశ్రయాలు, రైల్వేలను ఇప్పటికే అమ్మేసిందని, తిరుపతి ఎయిర్‌పోర్టును సైతం అమ్మకానికి పెట్టిందని ఆవేధన వ్యక్తం చేశారు. స్వతంత్ర్యం వచ్చిన కొత్తల్లో సైతం ప్రభుత్వాలు కార్మికులకు జీతాలు సక్రమంగా ఇచ్చాయని, ఇప్పుడు ఉన్న పాలకులు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో పాలన సాగిస్తూ, దోచేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి వాటిని అడ్డుకునేందుకు కార్మిక సంఘాలను ఏకమై, విసృత్త పోరాటాలను చేయాలని కోరారు. అందుకు ఐఎన్‌టియుసి కృషి చేస్తుందన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రసాద్, పవన్, షమీఉల్లా, రాజేస్, మునెయ్య, మురళీ, బోయాషావల్లి, అనుషా పాల్గొన్నారు.



సిబ్బంది ఆనందమే.. సంస్థ అభివృద్ధికి మార్గం

అందరి కృషితోనే ఆదాయంలో స్టేట్ ఫస్ట్

జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- తిరుపతి సిటి:

సిబ్బంది ఆనందంగా ఉంటేనే ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించగలరని, దీని ద్వారా సంస్థ అభివృద్ధి మార్గంలో పయనిస్తుందని ఏపిఎస్‌ఆర్‌టిసి జిల్లా ప్రజారవాణాధికారి టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రజారవాణా వ్యవస్థలో జరుగుతున్న అభివృద్ధిపై తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలపు వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే....

ప్రజాశక్తి : ఏపిఎస్ ఆర్‌టిసిలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థానం ఏంటి?

డిపిటిఒ చెంగల్‌రెడ్డి: ఏపిఎస్ ఆర్‌టిసిలో రాష్ట్ర వ్యాప్తంగా తిరుపతి జిల్లా 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఆదాయంతో స్టేట్ ఫస్ట్‌లో నిలిచింది.

ప్రజాశక్తి : జిల్లాలో విద్యుత్ బస్సుల పనితీరు?

డిపిటిఒ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2022లో సంస్థ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టింది. తిరుమల ఘాట్‌రోడ్డులో తిప్పేందుకు ప్రయోగాత్మకంగా నిర్వహించి, అనంతరం 100 బస్సులను దశలవారీగా అందజేశారు. ప్రస్తుతం 50 బస్సులు తిరుపతి- తిరుమల మధ్య నడుస్తున్నాయి. వీటికి చార్జింగ్ పాయింట్ల ప్రధాన కేంద్రంగా అలిపిరి డిపోను కేటాయించాం. తిరుపతి డిపోలో సైతం విద్యుత్ బస్సులకు చార్జింగ్ అందించేందుకు పాయింట్లు ఏర్పాటు చేశాం. మరో 14 బస్సులు తిరుమల- రేణిగుంట, శ్రీకాళహస్తి మధ్య నడుస్తున్నాయి. త్వరలో 12బస్సులు తిరుపతి- నెల్లూరు, కడప- తిరుపతికి 12 బస్సులు, మదనపల్లి- తిరుపతి మధ్య మరో 12 విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతాం. వీటికి మంచి ఆదరణ లభిస్తోంది. ఆదాయం దిశగా పయనిస్తోంది. తిరుమలకు పూర్తిస్థాయిలో విద్యుత్ బస్సులనే నడిపేందుకు టిటిడి యాజమాన్యం సంప్రదింపులు జరిపింది. ఆర్‌టిసి ఉన్నతాధికారులు దీన్నిపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో అది కూడా కార్యరూపం దాల్చుతుందని నమ్మకం.

ప్రజాశక్తి : కార్గో సేవల ఆదాయం ఎలా ఉంది?

డిపిటిఒ: కార్గో సేవలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తగా కార్గోసేవలను మరింత విస్తృత పరుస్తున్నాం. గత ఏడాది తిరుపతి జిల్లాలో 6కోట్ల 80లక్షలు ఆదాయం వచ్చింది. కార్గో సేవలు మరింత విస్తృతం చేయాలని నిర్ణయించాం. రాబోవు ఆర్థిక సంవత్సరంలో 22కోట్ల లక్ష్యంగా పని చేస్తున్నాం. డోర్ డెలివరీ పెంచడం, అవసరమైన మండలాల్లో, ప్రాంతాల్లో కార్గో ఏజెన్సీలను ఏర్పాటు చేస్తాం. అల్ట్రా, సూపర్ లగ్జరీ బస్సులు, ఏసి బస్సుల్లో సైతం డిక్కీలను కూడా సరుకు రవాణాకు వినియోగించాలని నిర్ణయించాం. బస్సు టాప్‌ను కూడా లగేజికి కేటాయించాం. ఎవ్వరైన బల్కుగా తీసుకొవచ్చు, రోజుకు, వారానికి, నెలల ప్రతిపాదన కూడా టాప్‌లను అద్దెకు ఇస్తాం. త్వరలో టిమ్ ద్వారా కూడా కార్గోసేవలు అందుబాటులో ఉంటాయి. వస్తువును బట్టి కండక్టరే టిక్కెట్ ఇచ్చేలా సేవలు అందించాలని ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్రజాశక్తి : కొత్త సర్వీసులు ఏవైన ఏర్పాటు చేశారా?

డిపిటిఒ: తిరుపతి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ప్రాంతం. ఇక్కడికి నిత్యం లక్షలాది మంది యాత్రికులు వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రద్దీకి అనుగుణంగా ప్రతిశని, ఆదివారాల్లో తిరుమలకు బస్సుల సంఖ్యను పెంచి రోజుకు లక్ష మందిని కూడా కొండకు చేర్చేందుకు ఏర్పాట్లు చేసి, విజయం సాధించాం. తిరుణ్ణామలైలో పౌర్ణమి ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 5వ తేదీ ప్రత్యేకంగా తిరుపతి నుంచి 20 బస్సు సర్వీసులను ఏర్పాటు చేశాం. మంచి ఆదరణ లభించింది. బస్సులన్ని కిక్కెరిశాయి. ప్రయాణీకుల కోరిక మేరకు ఏసి బస్సులను కూడా ఏర్పాటు చేశాం. దీనివల్ల మంచి ఆదాయం వచ్చింది. ఇక నుంచి ప్రతినెలా పౌర్ణమికి ప్రత్యేక సర్వీసులు నడుపుతాం. శమరిమలైకూ యాత్రకులు జిల్లా నుంచి వేలల్లో వెలుతుంటారు. వారికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశాం. కావాల్సిన వారికి అద్దె ప్రతిపాదికన టూర్ ప్యాకేజిని ప్రవేశపెట్టాం.

ప్రజాశక్తి : సిబ్బంది తోడ్పాటు ఎలా ఉంది?

డిపిటిఒ: జిల్లాలోని డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది పనితీరు చాలా బాగుంది. సిబ్బంది మానసికంగా సంతోషంగా ఉంటే ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించగలరు. తద్వారా సంస్త అభివృద్ధి దిశగా వెళుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను త్వరతగతిని తన దృష్టికి వచ్చిన వాటిని పరిష్కరిస్తున్నాను. ఉత్తమసేవలు అందించే వారిని ప్రోత్సహిస్తూ ప్రశంస పత్రాలను సైతం అందిస్తున్నాం.

ప్రజాశక్తి : ప్రభుత్వంలో విలీనం తర్వాత సంస్థ పరిస్తితి ఎలా ఉంది?

డిపిటిఒ: ఆర్‌టిసిని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడం అనేది చారిత్రాత్మకం. దీనివల్ల సిబ్బందికి ఆర్థిక, ఉద్యోగ భద్రత ఏర్పడింది. వారు మరింత సంతోషంగా ప్రయాణీకులకు సేవలందిస్తున్నారు. గ్రామీణప్రాంతాలత్లో సర్వీసులను పెంచాం. సిబ్బందిలో కూడా నమ్మకం పెరగడంతవో అంకితభావంతో పనిచేస్తున్నారు. ప్రజారవాణా వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా అందిస్తున్నాం.

ప్రజాశక్తి : వేసవిలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిపిటిఒ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి బస్టాండులో మంచినీరు నిరంతరం పుష్కలంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. జిల్లా వైద్యాధికారి (డిఎంహెచ్‌వో)ను సంప్రదించి, ఆయన సహకారంతో బస్టాండుల్లో ఎండ ఎద్దడి తట్టుకునేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నాం, ప్రతి బస్సుల్లో కూడా వృద్దులు, మహిళలు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాదుల కలవారిని దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుతున్నాం. దాతల సహకరిస్తే విరివిగా చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తాం.

ప్రజాశక్తి : జిల్లాలో సిబ్బంది కొరత ఉందా?

డిపిటిఒ: జిల్లాలో సిబ్బంది లోటు లేదు. కండక్టర్లు అదనంగా ఉంటున్నారు. ఒక్కోసారి పక్క జిల్లాకు సైతం అవసరాల రిత్యా పంపుతున్నాం. డ్రైవర్లలో 80మంది తక్కువ ఉన్నారు. దాన్ని అధికమించేందుకు ఆన్‌కాల డ్రైవర్ల పద్ధతిలో కొంతమందిని అద్దె ప్రతిపాదిన తీసుకుని ప్రయాణీకులకు సేవలందిస్తున్నాం. తిరుపతిలో ఉన్న వర్క్‌షాపు నెల్లూరుకు వెళ్లిన తర్వాత కూడా తమకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాలేదు. బస్సులు కండీషన్లోనే ఉంచుతూ, సర్వీసు చేస్తున్నాం.

ప్రజాశక్తి : భవిష్యత్తు కార్యచరణ?

డిపిటిఒ: ప్రయాణీకులకు మెరుగైన సేవలందించేందుకు ప్రస్తుతం ఉన్న సెంట్రల్ బస్టాండు స్థానంలో డిజిటల్ బస్సు స్టేషన్‌ను తీసుకురానున్నాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం అనుమతి సైతం అందించింది. బస్టాండును విస్తృత్త పరచాలంటే తిరుపతి డిపోలో ప్రస్తుతం ఉన్న గ్యారేజీ మార్పు చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో ఎక్కడన ఆర్‌టిసికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టరును ఇప్పటికే కోరాం. విద్యుత్ బస్సులకు చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేసేందుకు తిరుమలలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని టిటిడి యాజమాన్యానికి విన్నవించాం. అందుకు వారు కూడా సానుకూలత వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి : డిస్పెన్సరీ ఇరుకుగా ఉంది?

డిపిటిఒ: తిరుపతి బస్టాండులో ఉన్నది చాలా కాలం క్రితం డిస్పెన్సరీ. దీన్ని మార్పు చేయాలనిబావించాం. ప్రస్తుతం సిబ్బంది క్వార్టర్స్ ఉన్న ప్రాంతంలో కొత్త డిస్పెన్సరీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేసి, ప్రభుత్వానికి పంపించాం. త్వరలో దానికి అనుమతులు వస్తాయి. ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యుల కూడా సరిపడి ఉన్నారు. మందులకు సంబంధించి ఎలాంటి కొరత లేదు. ఆసుపత్రికి వచ్చే సిబ్బందికి, వారి కుటుంబాలకు అవసరమైన మందులను అందిస్తున్నాం.

ప్రజాశక్తి: బస్టాండులో వస్తువుల ధరలు ఎక్కువని ప్రయాణీకులు ఫిర్యాదు?

డిపిటిఒ: బస్టాండులోని అన్ని షాపులు ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలి. దీన్నిపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశాం. నిబంధలను పాటించన వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. అవసరమైతే లైసెన్సును సైతం రద్దు చేస్తాం.

ప్రజాశక్తి : బస్సులు కండీషన్ ఎలా ఉంది?

డిపిటిఒ: జిల్లాలో బస్సుల కండీషన్ చాలా బాగుంది. కండీషన్‌గల బస్సులు ఉంటేనే డ్రైవర్లు బాగా పని చేయగలరు, ప్రయాణీకులకు కూడా మెరుగైన సేవలు అందిస్తారు. తిరుమల ఘాట్‌రోడ్డులో పనిచేస్తే డ్రైవర్ల పనితీరు చాలా బాగుంది. రోజుకు 1600 ట్రిప్పులు తిప్పుతూ 90వేల మందికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. కండక్టర్లు, ఇతర సిబ్బంది, అసోసియేషన్ల సహకారం బాగా ఉంది. అందుకు జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తోంది.

ప్రజాశక్తి : ఆర్‌టిసిలో మీ పయనం ఎలా సాగింది, మీ కుటుంబ నేపధ్యం?

డిపిటిఒ: మాది ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలోని కెవి.పల్లి మండలంలోని ఒగళ్లు గ్రామం. మానాన్న సాధారణ రైతు. యశోదమ్మ, వెంకట రామిరెడ్డిలకు ఇద్దరు పిల్లలం. మాఅక్క, నేను. తల్లిదండ్రి ప్రోత్సహంతో బాగా చదువుకుని 1989లో ఆర్‌టిసి డిపో మేనేజరు ట్రైనింగ్‌కు ఎంపికయ్యాను. 1990లో పులివెందల డిపో మేనేజరుగా బాధ్యతలు స్వీకరించాను. అక్కడ నుంచి అనంతపురం డిఎం, బి.కొత్తకోట డిఎం, శ్రీకాళహస్తి డిఎంగా బాధ్యతులు నిర్వహించి, పదోన్నతిపై డివిఎంగా తిరుపతికి వచ్చాను. నెల్లూరు, తిరుపతిలో డివిఎంగా 2015 వరకు చేశాను. 2016లో పదోన్నతిపై కడప ఆర్ఎంగా బాధ్యతులు తీసుకున్నాను. 2019లో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్ఎంగా బదిలీపై వచ్చాను. అనంతరం జిల్లాల విభజన, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారిగా విధులు నిర్వహిస్తున్నాను. అందరితోనూ స్నేహపూర్వకంగా ఉంటూ, సంతోకరంగా విధులు నిర్వహించేలా చేసి, సంస్థకు దేవుళ్లైన ప్రయాణీకులు మెరుగైన సేవలందిస్తూ, సంస్థను అభివృద్ధి పదంలో నడిపేందుకు కృషి చేస్తున్నాను.

చంద్రగిరి వారపు సంతలో అన్నదానం



ప్రజాశక్తి-చంద్రగిరి: నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి వారపు సంతలో ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం సంతకు విచ్చేసే వినియోగదారుల సౌకర్యార్థం ఉచిత భోజన వసతులను కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని వారసంతల్లో ప్రజలకు ఉచిత భోజన వసతులు కల్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. వారపు సంతలో రైతులు తాము పండించిన కూరగాయలను ఎలాంటి రుసుం చెల్లించకుండా విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువు మరో నేత్రం



ప్రజాశక్తి - బాలాయపల్లి : చదువు మరో నేత్రమని విందోటి సౌజన్య రెడ్డి స్కూల్ ప్రిన్సిపల్ దానం జయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు రూరల్ మండలం గొల్లపల్లి గ్రామంలోని విందోటి సౌజన్య రెడ్డి స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకోవడంతో జ్ఞానంతో పాటు సమాజంలో మంచి పేరు ప్రతి ష్టలు వస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులకు తక్కువ ఫీజులతో విద్యను అందిస్తూ గత 20 ఏళ్లుగా విద్యను అందించడం ఎంతో గొప్ప అన్నారు. అనంతరం విద్యార్థులు నత్య ప్రదర్శనతో అలరించారు. కార్యక్రమం లో జీసస్ లవ్ మినిస్ట్రీ నిర్వాహకులు సుధాకర్ బాబు, దాసరి శ్రీనివాసులు, విందోటి సౌజన్యరెడ్డి పాఠశాల కరస్పాండెంట్ దానం సురేంద్రబాబు, ఉపాధ్యాయులు చెంచమ్మ కారుణ్య గౌతమి తదితరులు పాల్గొన్నారు.

పూడిలో ఈద్గా ప్రారంభోత్సవం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలోని పూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ముస్లిం సోదరులకు ప్రార్థన స్థలం ఈద్గాను ఆదివారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా ప్రారంభించారు. మంత్రికి ముస్లిం మత పెద్దలు ఘనస్వాగతం పలికారు. మంత్రి ఆర్.కె.రోజాను, సోదరులు రాంప్రసాద్‌రెడ్డిలను గజమాల, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముస్లిం సోదరులకు ఎల్లవేళలా అండగా ఉన్నారని తెలిపారు. విద్య, వైద్యం, ఆర్థిక భరోసా ఇస్తూ సమాజంలో గౌరవంతో పాటు రాజకీయంగా అభివద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, డీసీసీబీ వైస్ ఛైర్మన్, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామకరణానికి మంత్రి ఆర్‌కే రోజా హాజరు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పుత్తూరులోని ఓ మండలంలో జరిగిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మనవడు నామకరణ కార్యక్రమానికి ఆదివారం మంత్రి ఆర్.కె.రోజా హాజరయ్యారు. డిప్యూటీ సీఎం మనుమడు నెహన్ కార్తికేయన్ నామకరణ మహోత్సవంలో పాల్గొని మంత్రి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కార్వేటినగరం జడ్పీటీసీ పరంజ్యోతి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయప్రకాష్. మైనారిటీ రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షులు మాహీన్, డిప్యూటీ సీఎం కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె గడపలో 'చెవిరెడ్డి మోహిత్ రెడ్డి'



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలో గత రెండు వారాలుగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు మోహిత్ రెడ్డి చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయమాణిక్యం పంచాయతీలో నిర్వహించారు. మోహిత్‌రెడ్డి రాకతో గ్రామంలోని వైసిపి నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మండల అభివద్ధికి శక్తివంచన లేకుండా కషి చేసి అభివద్ధి చేస్తానని.. ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు చంగల్‌రెడ్డి, తలకోన మాజీ ఛైర్మన్ రెడ్డప్ప రెడ్డి, జడ్పిటిసి కరుణాకర్ రెడ్డి, నాగార్జునరెడ్డి, నెరబైలు ఎంపిటీసీ సుధాకర్ రెడ్డి , హరినాథ్ రెడ్డి, సునీల్, సర్పంచులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

బాలుకు జ్యోతిరావు పూలే అవార్డు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రమణ్యం ప్రతిష్టాత్మక జ్యోతీరావు పూలే ఎక్స్ లెన్స్ అవార్డును అందుకున్నారు. పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆదివారం తిరుపతిలోని దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రాంగణంలో ఆ అవార్డును బాలుకు అందించారు. ఉత్తమ విద్యా బోధన, సాహిత్యం, కళలు, సామాజిక సేవలకు గాను చేస్తున్న కషికి గుర్తింపుగా ఈ అవార్డును బాలుకు అందచేసినట్లు ఫెడరేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ జడ్జి చంద్రకుమార్, సీనియర్ పాత్రికేయులు, కవి ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల డాక్టర్ .. భాస్కర్‌రాజు

పేటెంట్ హక్కుతో ప్రశంసలు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: వీళ్లకు చదువు రాదు.... వీళ్లకు చదువు చెప్పలేము... వీళ్లు చదువుకు పనికిరారు... అనే నానుడిని తిరగరాసి, విద్యపై ఏకాగ్రత లేని వారికి కూడా చదువుపై మమకారం పెంచి, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది.. చదువులు డాక్టరుగా పెరుగడించిన సంగరాజు భాస్కరరాజు శ్రమను గుర్తించి హ్యాండ్‌రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ స్లేట్‌కు పేటెంట్ హక్కు ఇచ్చారు. ఈ ఘనతను పురస్కరించుకుని న్యూబాలాజీ కాలనీలోని పోలీసు ఫెరడ్ మైదానం పక్కనున్న మేక్‌మైబేబి జీనియస్ స్కూల్ ప్రాంగాణంలో ఆదివారం ఆయనకు ఆత్మీయసభ ద్వారా సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయరు భూమన అభినయ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్కర్‌రాజు లక్ష్యం... దాని కోసం ఆయన చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. రెండుచేతులతో హ్యాండ్‌రైటింగ్ అద్భుతంగా రాపించడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. ఈ విషయం తెలిసి తాను కూడా రాజకీయంలో ఎంతో బిజీగా ఉన్న ఆయన వద్ద శిష్యరికం చేశానని, కేవలం 40 రోజుల్లోనే కుడిచేత్తో ఎంత అద్భుతంగా రాయగలనో ఎడమ చేత్తో కూడా అంత అద్భుతంగా రాయగలిగానని తెలిపారు. భాస్కర్‌రాజు లాంటి వారు ఊరికి ఒక్కరుంటే పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని, చదువులో ఆత్మవిశ్వాసం పెరుగుతందని కొనియాడారు. ప్రయివేట్ విద్యాసంస్థ అసోసియేషన్ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ భాస్కర్‌రాజు ఒక వ్యక్తి కాదు, ఒక వ్యవస్థ అని కొనియాడారు. యువతను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఆయన కృషి చేస్తున్నారని అన్నారు. చదువుపట్ల ఆనాసక్తి ఉన్న పిల్లల్లో సైతం ఆసక్తిని రేపి, చదువుపట్ల మక్కువ పెంకునేలా చేసేందుకు ఆయన అనేక పరిశోధనలు చేసి విజయం సాధించారన్నారు. న్యాయవాధి ఎల్‌వి రమణ మాట్లాడుతూ ఒక వ్యక్తి చేతిరాతను ఆ వ్యక్తి వ్యవహార్శైలీని చెప్పలగరి, అలాంటి నానుడిని మార్చేలే భాస్కర్‌రాజు తన వద్దకు వచ్చే ప్రతిఒక్కరికి అద్భుతమైన చేతిరాతను అందిస్తున్నారని అన్నారు. భాస్కర్‌రాజు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఎంఎంబిఎస్ స్కూల్ అధినేత, చదువుల డాక్టరు భాస్కర్‌రాజు మాట్లాడుతూ హాండ్‌రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ స్లేట్ పేటెంట్ హక్కు పొందడం నాలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. 2000 సంవత్సరంలో ఇలాంటిది ప్రపంచంలో మరెక్కడన్న ఉందా అని అన్వేషించానని, ఎక్కడ లేదని నిర్ధారణ అయిన తర్వాత 2009లో పేటెంట్ హక్కుకు దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. కానీ హైదరాబాదుకు చెందిన కొందరు మా స్లేట్‌లు తీసుకుని, అవి మేమే తయారు చేశామని చెప్పకున్నారని, దీన్ని గమనించి, వారిపై కోర్టుకెళ్లి విజయం సాధించమన్నారు. ఈ ఏడాది మార్చి 13వ తేది పేటెంట్ హక్కును సాధిస్తూ, సర్టిఫికెట్ స్వీకరించామని తెలిపారు. 2000 సంవత్సరంలో తాను తిరుపతికి వచ్చినప్పుడు తనను మొదట ప్రోత్షహించింది విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్‌రెడ్డి అని, ఆయన సహాయం ఎప్పడికి మరిచి పోలేన న్నారు. హ్యాండ్‌రైటింగ్, విద్యపై అందరికీ ఏకగ్రత పెంచడంలో ఇప్పటి వరకు కొంత విజయం సాధించానని, ఇంకా సాధించాల్సింది ఉందన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో విజయం సాధిస్తానని ధీమావ్యక్తం చేశారు. చదువులో వెనకబడిన వారి ఆవేదన స్వయంగా చూసి, ఎదైనా చేయాలనే తపనతో భాస్కరరాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశానన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒకరిలో చదువు పట్ల ఆసక్తి కల్పించి, ఏకగ్రతను పెంచేందుకు కృషి చేస్తున్నానని, త్వరలోనే అందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆవిష్కరణలు చేస్తానని తెలిపారు. 25 సంవత్సరాలు పైబడి, డిగ్రీలు పూర్తి చేసిన వారు కూడా చదువుపై ఏకగ్రత కోసం తన వద్దకు వస్తున్నారని, వయస్సుతో నిమిత్తం లేకుండా క్వాలిటీ ఎడ్యుకేషన్‌కు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒకరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, రవీంధ్రనాథ్‌రెడ్డి, సుదర్శనరాజు, డాక్టరు బలరామరాజు, ధనంజయరెడ్డి, ప్రముఖులు, స్కూల్ సిబ్బంది దితరుపాల్గొన్నారు.

వృద్ధులకు సరుకుల పంపిణీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: వై.జె.పి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వద్ధులకు ఫల సరకులను పంపిణీ చేశారు. ఆదివారం గూడూరు పట్టణంలోని డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా భావం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్‌కుమార్, ట్రెజరర్ గోపీనాథ్‌రెడ్డి, ఫల సరుకుల కమిటీ ఛైర్మన్ వరిదిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , సీనియర్ సభ్యుడు ఆర్.వి.రావు, మాజీ అధ్యక్షుడు వేణురెడ్డి, క్లబ్ సభ్యులు సుబ్రహ్మణ్యం, రాధాకష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సి.జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారంతో డాక్టర్.సి.ఆర్.రెడ్డి ఆసరా పథకం కింద ఫల సరుకులను పంపిణీ చేశారు. డాక్టర్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సంఘానికి తమవంతు చేయూతకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకష్ణారెడ్డి మాట్లాడుతూ మంచి కార్యక్రమానికి చేయూతనిస్తున్న డాక్టర్.సి.జనార్దన్‌రెడ్డి, రోహిణిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గూడూరు టూటౌన్ ప్రధాన కార్యదర్శి బండి ధనంజయరెడ్డి, సిద్ధారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, నిరంజన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎర్రమాక కష్ణారెడ్డి, కష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, హరికష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలోని శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ షిరిడి సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్ క్రాస్ సౌజన్యంతో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కోట మండలంలోని పలు గ్రామాల నుండి యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. సుమారు 111 మంది రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 333 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ సంస్థ సేకరించారు. రక్తదానం చేసిన రక్త దాతలను జగన్మోహన్ రెడ్డి, అల్లం రమణయ్యలు ఘనంగా సన్మానించి కతజ్ఞతలు తెలిపారు. శ్రీ షిరిడి సాయి అక్షయ సేవాసమితి బందానికి, రెడ్ క్రాస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శ్రీ కోటమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాగల పురం గిరిరెడ్డి, కొండూరు.వెంకటరమణారెడ్డి,పెళ్లూరు కోటేశ్వరరెడ్డి, కలిచేటి బాస్కర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, ఆర్.చంద్ర ఆచారి,అవుల సుబ్బయ్య, వేమూలూరు బాబురావు, శ్రీరాం సుధాకర్, బల్లవోలు సుధాకర్ స్వామి, ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, శంకర్, వేలంగిణి, వైసీపీ నేతలు ఎర్రటపల్లి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు రమణరెడ్డి, టిడిపి నాయకులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, వాకా విజయ్ భాస్కర్‌రెడ్డి, పిపిఎఫ్ ఛైర్మన్ మీజూరు మల్లికార్జున రావు, శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం సిబ్బంది ప్రకాష్, వెంకట కృష్ణయ్య, సాయి, కుమార్, కష్ణయ్య, నాగేశ్వరరావు, బూసి సుబ్రహ్మణ్యం, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు శ్రీనివాసులురెడ్డికి అభినందనలు

ఉత్తమ నెల్లూరు గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, ప్రముఖ రైతు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి ఆదివారం కోటలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రక్తదానం పవిత్ర కార్యమని తెలిపారు. 1997 నుంచి ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేశానన్నారు. నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డితోపాటు పలువురు ఆయన్ను అభినందించారు.

దేశంలో స్వచ్ఛమైన రాజకీయాలు ఏర్పాటవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశంలో స్వచ్ఛమైన రాజకీయాలు ఏర్పడేలా ఆదర్శ భారతీయం స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని జాతీయ అధ్యక్షులు అనపరెడ్డి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో సామాన్య ప్రజలు కూడా పాల్గొనే విధంగా అన్నింటిపై పూర్తి అవగాహన కల్పించడానికి, స్వచ్ఛమైన రాజకీయ నాయకుడిని తయారు చేయడానికి ఆదర్శ భారతీయం అహర్నిశలు పనిచేస్తుందన్నారు. డబ్బుకు ఓటు అమ్ముకోవడం అంటే భావి పౌరుల భవిష్యత్తును అమ్ముకోవడమేనన్నారు. దేశ భవిష్యత్తును నిర్దేశించేది సిరా చుక్క అయితే, మద్యం చుక్క దేశ భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. భారతీయ విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలు సామాన్య ప్రజానికంలో దాగివున్న సత్తా కలిగిన నాయకులను గుర్తించి వారిని బలమైన నాయకులుగా తీర్చిదిద్దడం బలోపేతమైన దేశాన్ని నిర్మించడమే లక్ష్యంతో దక్షిణాది నుండి ఉత్తరాది వరకు రాజకీయ ప్రక్షాళన జరగాలని దఢ సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా బి.రమాదేవి, జాతీయ గౌరవ సలహాదారులుగా సుధాకర్ చౌదరి, జాతీయ సహాయ కార్యదర్శిగా వనం నవీన్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాపూరు డోలాకష్ణ, రాష్ట్ర కార్యదర్శిగా వలసపల్లి జయరాం, తిరుపతి జిల్లా అధ్యక్షులుగా సానాల గంగాధరం, గౌరవ అధ్యక్షులుగా పగడాల ప్రసాద్, తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శిగా బూరగ ఓంకార్ లను ఎన్నుకున్నామని వివరించారు.

'నారా లోకేష్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర పేరుతో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాల నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగడుతున్నారని టిడిపి తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ కొన్ని వ్యాఖ్యలను చేశారని.. దాన్ని వక్రీకరించి వైసిపి సోషల్ మీడియా ప్రచారాలు చేయడం గర్హనీయమని, దీన్ని టిడిపి శ్రేణులుగా ఖండిస్తున్నామన్నారు. టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కాయం వెంకటరత్నం మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయంలో దళితుల విద్యాభివద్ధి కోసం అంబేద్కర్ పేరుతో విదేశీ విద్య పథకాన్ని ప్రవేశపెట్టారని, అధికారంలోకి వచ్చిన వైసిపి అంబేద్కర్ పేరును తీసేసి సీఎం జగన్ పేరు పెట్టారన్నారు. ఎస్సీలకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారన్నారు. నేడు ఎస్సీ ఎస్టీ ప్రజలకు, లోకేష్ కు మధ్య చిచ్చుపెట్టాలని వైసిపి సోషల్ మీడియా వక్రీకరించిన వీడియోలను వైరల్ చేస్తోందన్నారు. ఎలాంటి కుయుక్త రాజకీయాలు చేసిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని రాష్ట్ర ప్రజలు బలపరుస్తారని స్పష్టం చేశారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: అతివేగం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. విహార యాత్రకు బయ లుదేరిన ఇద్దరు యువకులు అనంత లోకాలకు చేరుకున్నారు. పోలీసుల వివరాలు మేరకు.. వరదయ్యపాలెం సమీపంలోని ఉబ్బల మడుగు జలపాతానికి తమిళనాడు పుందిమల్లై చెందిన యువరాజ్(21), విశ్వ(18) ఇద్దరు ఆదివారం స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చారు. దరఖాస్తు వద్ద అతివేగంతో ద్విచక్ర వాహనం నడపడంతో అదుపు చేయలేక పక్కనే ఉన్న వినాయకుని గుడిని ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి పంచనామా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంగళం బొమ్మల క్వార్టర్స్ లో అగ్నిప్రమాదం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీలోని బొమ్మల క్వార్టర్స్ లో ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. బి.రంగనాథన్(వినాయక ప్రతిమల తయారీదారుడు) కు చెందిన ఓ షెడ్డులో వినాయక విగ్రహాలను తయారు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు రావడంతో హుటాహుటిన అక్కడి కార్మికులతో తయారీలో ఉన్న వినాయక విగ్రహాలను వెంటనే తీసుకెళుతూనే అగ్నిమాపక దళానికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. ఈ ఘటనలో 25 వినాయక ప్రతిమలు దెబ్బతిన్నాయని, సుమారు ఐదు లక్షలు రూపాయలు నష్టం అయ్యిందని బాధితుడు రంగనాధన్ ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

ఒకరికి గాయాలు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా.. మరొకరు గాయ పడిన సంఘటన మండలంలోని పులికుంద్రం గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పిచ్చాటూరు మండలం లోని ఎస్ఎస్‌బీ పేట గ్రామానికి చెందిన అజిత్ (20) సొంత పనుల నిమిత్తం పిచ్చాటూరుకు వస్తుండగా పులికుంద్రం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను అదుపుతప్పి ఢీకొన్నారు. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంలోని మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంటలార్పడంపై అవగాహన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనుకోని అగ్ని ప్రమాదాల్లో చెలరేగే మంటలను ఆర్పడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శ్రీకాళహస్తి అగ్నిమాపక శాఖధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీ, ఈటీసీ కేంద్రం వద్ద అగ్నిమాపక అధికారులు గ్యాస్, ఆయిల్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో జరిగే ప్రమాదాలను డెమో ద్వారా వివరించారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నడకతో బీపీ, షుగర్ వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని.. తిరుపతికి చెందిన వైద్యనిపుణులు డాక్టర్ జయప్రకాష్ అన్నారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షులు రామచంద్రనాయుడు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే గంట పాటు నడక, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథరెడ్డి, గోపికష్ణ, మాజీ అధ్యక్షులు మురుగేషన్ రెడ్డి, రామ్మోహన్‌రాజు, ద్వారకనాథ్‌శెట్టి, కుప్పయ్యశెట్టి, కెఎల్ మూర్తి, యుగంధర్‌రాజు, సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతంగా నవోదయ నమూనా పరీక్ష

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం నవోదయ నమూనా పరీక్షను కరస్పాండెంట్ పి.నవకోటి ఆధ్వర్యంలో మూడోసారి నిర్వహించారు. ఈ పరీక్షకు ఇతర పాఠశాలల నుంచి సుమారు వందమంది విద్యార్థులు హాజరయ్యారు. కె.హరికష్ణ, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఎన్.సాయి, సింధు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగలో ఆదివారం సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎంటెక్ బాబు ఆధ్వర్యంలో మండల కన్వీనర్లను నియమించారు. బీన్ కండ్రిగ మండల కన్వీనర్‌గా రవిచంద్ర, కో కన్వీనర్‌గా అనిల్, సత్యవేడు నియోజకవర్గ యూత్ కన్వీనర్‌గా సుబ్రహ్మణ్యంలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఆరేటమ్మ అమ్మవారికి కానుకల వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని అరేటమ్మ అమ్మవారి ఆలయానికి తిరుపతికి చెందిన కేవీ రామ్ గోపాల్, గాయత్రీ దంప తులు ఆదివారం వెండి విభూది పట్టా, వెండి కోరలు, వాయిద్య ఢమరుకం వితరణగా ఆలయ ఛైర్మన్ మనోహర్‌రెడ్డికి అందించారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-రేణిగుంట: నందమూరి తారక రామారావు సేవలు చరిత్రలో సువర్ణ అక్షరాలతో నిలిచిపోయాయని ఎన్టీఆర్ టు ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర నాయకులు కష్ణయాదవ్ తెలిపారు. ఆదివారం రేణిగుంట పట్టణంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా నందమూరి అభిమానుల సమావేశం నిర్వహించారు. మే 20వ తేదీన నందమూరి తారక రామారావు జయంతి వేడుకలతో పాటు శత జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కష్ణ యాదవ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దేవుడు తారక రామారావు అన్నారు.